సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 17 । ఆగస్టు । 2025

గరిష్టం/కనిష్టం
29.0/24.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అల్పపీడన ప్రభావంతో పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.



క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలి

జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో రాష్ట్రస్థాయి బేస్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను రాష్ట్ర బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు చల్లా హరిశంకర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. - వివరాలు 8లో▸

న్యూస్‌రీల్

ఉత్తమ సేవలకు పురస్కారం



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సుమలత

కై లాస్‌నగర్: జిల్లాలో క్షయ నియంత్రణకు చేస్తున్న కృషికి గాను జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ సుమలతకు పురస్కారం లభించింది. 2024 సంవత్సరానికి గాను జయశ్రీ మెమోరియల్ ఉత్తమ జిల్లా టీబీ అధికారి అవార్డు వరించింది. శనివారం వికారాబాద్‌లోని హరిత రిసార్ట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారం అందుకున్నారు.

పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలి

కైలాస్‌నగర్: వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి స్వయం సహాయక సంఘాలు, మెప్మా సహకారంతో బాధితులకు స్నాక్స్, భోజన వసతి కల్పించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి గూగుల్ మీట్ ద్వారా జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు, ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అవసరమైన చోట సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఇళ్లలోకి వరద నీరు ప్రవేశించిన గ్రామాలు, కాలనీల్లో వెంటనే నీటిని తొలగించి శానిటేషన్ చర్యలు చేపట్టాలని డీపీవోను ఆదేశించారు. వైద్యశిబిరాల ఏర్పాటుతో పాటు ఫీవర్ సర్వే నిర్వహించాలన్నారు. అన్ని పీహెచ్‌సీల్లో సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. సహాయక చర్యల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. రోడ్లు, వంతెనలు దెబ్బతిన్న వాటి వివరాలు సేకరించి వెంటనే తాత్కాలిక మరమ్మతు చేయాలని, శాశ్వత పరిష్కారం కోసం ప్రతిపాదనలు పంపించాలన్నారు. నాలాలు, మురుగు కాలువలు శుభ్రపరచడం ద్వారా నీటి నిల్వ లేకుండా చూడాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులకు డ్యామ్‌లు, చెరువులు, వాగుల వద్ద నీటి మట్టాలను పర్యవేక్షిస్తూ అవసరమైన నివేదికలు అందించాలన్నారు. ప్రజలు కాజ్‌వేలు, వాగులు, నదుల వద్దకు వెళ్లకుండా ఉండేందుకు పోలీస్, రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ శాఖలు పరస్పర సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట డీడీఆర్‌ఎఫ్ బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇందులో ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డివిజనల్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

ఆదిలాబాద్: భారీవర్షం కారణంగా నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ ప్రకటనలో కోరారు. జిల్లాలో కురిసిన భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజల ఇళ్లు, పంట భూముల్లోకి వరద చేరి పలువురు నష్టపోయారని తెలిపారు. నష్టాన్ని అధికారుల ద్వారా అంచనావేసి బాధితులకు నష్టపరిహారం అందించాలని కోరారు.



భాగ్యనగర్‌లో.. చిన్నారిని ఎత్తుకుని వస్తూ..



ఉట్నూర్‌లో.. హోటల్‌లోకి చేరిన వరదనీరు



బేల పాతబస్తీలో ఇళ్లను ముంచెత్తిన వరద



వాగులో కొట్టుకుపోతున్న వాహనం

• దూకిన 'మత్తడి'



గేట్లు ఎత్తడంతో దిగువకు నీటి పరవళ్లు

తాంసి: మత్తడివాగు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరగడంతో శనివారం ఉదయం ఐదు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఇన్‌ఫ్లో 39,116 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 42,860 క్యూసెక్కులు కొనసాగుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా 277.20 మీటర్ల వద్ద స్థిరంగా ఉండేలా ఔట్‌ఫ్లో కొనసాగిస్తున్నట్లు ఏఈ హరీశ్ కుమార్ తెలిపారు.

• ఉరకలేసిన 'సాత్నాల'



గేట్ల నుంచి ఉరకలేస్తున్న వరద

సాత్నాల: భారీ వర్షాలతో సాత్నాల ప్రాజెక్టుకు వరద ఒక్కసారిగా పెరిగింది. 40వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా .. నాలుగు గేట్ల ద్వారా అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జేఈ దీపక్ తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి సామర్థ్యం 1.24 టీఎంసీ కాగా ప్రస్తుతం 1.046 టీఎంసీగా ఉన్నట్లు పేర్కొన్నారు. దిగువ ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



జిల్లాకేంద్రంలోని తిలక్‌నగర్‌లో నీట మునిగిన ఇళ్లు

అతలాకుతలం

• జిల్లాలో కుండపోత వాన • ఉప్పొంగిన వాగులు, వంకలు • జలమయమైన లోతట్టుప్రాంతాలు
• నీటమునిగిన పంటలు, కాలనీలు • పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు • స్తంభించిన జనజీవనం



భాగ్యనగర్‌లో ఇంట్లోకి చేరిన వరదనీరు



విద్యార్థులతో మాట్లాడి వస్తున్న ఎమ్మెల్యే అనిల్



జీఎస్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శంకర్



సామగ్రిని ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న కుటుంబీకులు

కైలాస్‌నగర్: జిల్లాలో వర్షం దంచికొట్టింది. శనివారం వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకు కుండపోతగా కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చోట్ల కాలనీలు నీట మునగగా.. ఇళ్లలోకి వరద నీరు చేరింది. ప్రాజెక్టుల్లోకి భారీగా వరద చేరడంతో జలకళ సంతరించుకున్నా యి. లోలెవల్ వంతెనలపై వరద ఉప్పొంగి ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలి చిపోయాయి. పలుచోట్ల పంట చేలు ముంపునకు గురయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో జిల్లాలో జనజీవనం పూర్తిగా స్తంభించింది.

పలు కాలనీలు జలమయం

జిల్లాకేంద్రంలోని సుభాష్‌నగర్, దుర్గానగర్, గ్రీన్ సిటీ, కృష్ణానగర్‌లోని లోలెవల్ వంతెనలు ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. జీఎస్ ఎస్టేట్‌లోకి వర్షపునీరు చేరి చిన్నపాటి చెరువును తలపించింది. భాగ్యనగర్, మహాలక్ష్మివాడ కాలనీల్లోకి వర్షపునీరు చెరడంతో సామగ్రి అంతా తడిసిపోయింది. కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దుర్గానగర్ వాగు ఉ ప్పొంగి ప్రవహించడంతో కోజాకాలనీలో ఓ కారు వరదలో కొట్టుకుపోయింది. తాంసి మండలంలో ని హస్నాపూర్, బోథ్ మండలంలోని సాయినగర్ కాలనీ, బేలలోని పాత బస్తీ, ఇందిరానగర్‌కాలనీలను వరద ముంచెత్తింది.



బట్టిసావర్గాం లోలెవల్ వంతెనపై ప్రవహిస్తున్న వరదనీరు

- ఇంద్రవెల్లి మండలం ముత్నూర్‌లో రోడ్డు కోతకు గురైంది. ప్రమాదం జరుగకుండా అధికారులు అప్రమత్తమై రాకపోకలను నిలిపివేశారు.
- ఇచ్చోడ మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ వెంటనే అక్కడికి చేరుకుని విద్యార్థులను మూడో అంతస్తులోకి పంపించారు.
- కడెం వాగు ఉధృతికి బజార్‌హత్నూర్ మండలంలోని మాడగుడ సమీపంలోని పంట పొలాలు నీట మునిగాయి. అనుకుంట, చాంద గ్రామాల్లోని చేలల్లో వరద కారణంగా పత్తి పంట పూర్తిగా ధ్వంసమైంది.
- ఉట్నూర్–ఆదిలాబాద్ మార్గంలో ఉన్న వంతెనపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. మండలంలోని నాగాపూర్ సమీపంలోని బ్రిడ్జిపై నుంచి వరద ప్రవహించడంతో సబ్ కలెక్టర్ యువరాజ్ అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో వరద ప్రభావానికి గురైన ప్రాంతాలను ఎమ్మెల్యే పాయల్ శంకర్ పరిశీలించారు. మహాలక్ష్మి వాడ, తిర్పెల్లి, జీఎస్ ఎస్టేట్ కాలనీల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

వరద ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్‌లు భారీ వర్షంలోనూ వరదముంపు ప్రాంతాలను పరిశీలించారు. జలమయమైన మావల మండలంలోని మణిపూర్ కాలనీ, ఇచ్చోడలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, ఆదిలాబాద్ పట్టణంలోని కుమ్మరికుంట కాలనీలను సందర్శించి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏమైనా ఇబ్బంది తలెత్తితే టోల్‌ఫ్రీ నంబర్ 18004251939లో సంప్రదించాలని సూచించారు.



ఇచ్చోడలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

పలువురిని కాపాడిన రెస్క్యూటీమ్



సుభాష్‌నగర్‌లో వరదలో చిక్కుకున్న కుటుంబాన్ని కాపాడుతున్న పోలీసులు

దస్నాపూర్ వాగు ప్రవాహంతో సుభాష్‌నగర్ కాలనీలోని ఓ ఇంటిలోకి భారీగా నీరు వచ్చి చేరింది. దీంతో కుటుంబీకులు భవనం మొదటి అంతస్తుపైకి ఎక్కి తలదాచుకున్నారు. డీడీఆర్‌ఎఫ్ బృందం అక్కడికి చేరుకుని తాడు, లైఫ్‌జాకెట్ల సాయంతో ఐదుగురిని సురక్షితంగా తీసుకువచ్చారు. అలాగే గుడిహత్నూర్ మండలం సీతాగొంది గ్రామంలో ఆరుగురు సభ్యులతో కూడిన కుటుంబం వరదనీటిలో చిక్కుకుంది. బయటకు వచ్చేమార్గం లేపోవడంతో డీడీఆర్‌ఎఫ్ బృందం వారిని సురక్షితంగా కాపాడింది. ఈ ప్రక్రియను కలెక్టర్, ఎస్పీ స్వయంగా పర్యవేక్షించారు. కుమ్మరికుంట కాలనీలో రోడ్డుపై భారీగా వరదనీరు నిలిచి ఉండటంతో బోట్ల సాయంతో స్థానికులను ఇతర ప్రాంతాలకు తరలించారు.

కొట్టుకుపోయిన రెండు లారీలు..

సాత్నాల: సాత్నాల ప్రాజెక్టు నుంచి నీటిని వదలడంతో తర్నం వాగు ఉధృతంగా ప్రవహించింది. తాత్కాలిక వంతెనపై నిలిపి ఉంచిన మెదక్ జిల్లాకు చెందిన రెండులారీలు వరద ప్రవాహానికి కొట్టుకుపోయాయి. పోలీసులు లారీ డ్రైవర్‌ను తాడు సాయంతో రక్షించారు. ఈ మార్గంలో అంతర్రాష్ట్ర రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. మండలంలోని పార్డి(కె), పార్డి(బి) గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పెన్‌గంగ పరీవాహకప్రాంతమైన కామయి గ్రామంలోని ఇళ్లలోకి వరద చొచ్చుకు వచ్చింది.



తలమడుగు: రుయ్యాడి శివారులో దెబ్బతిన్న పంట



తాంసి: వడ్డాడి శివారులో పంటంతా ఇలా..

తాంసీలో అత్యధికం.. గాదిగూడలో అత్యల్పం

వర్షాకాలం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఈ సీజన్‌లో ఇదే భారీ వర్షం. శనివారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఒక్క రోజే జిల్లాలో 2078.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తాంసి మండలంలో 170.6 మి.మీ నమోదైనట్లుగా అధికారులు తెలిపారు. ఇక తలమడుగులో 162.4, మావలలో 154.2, గుడిహత్నూర్‌లో 145.2, సిరికొండలో 144.4, ఆదిలాబాద్ అర్బన్‌లో 142.0, ఇంద్రవెల్లిలో 135.2, జైనథ్‌లో 132.6, ఆదిలాబాద్ రూరల్‌లో 126.0, ఇచ్చోడలో 123.2, నేరడిగొండలో 91, బజార్‌హత్నూర్‌లో 89.2, భీంపూర్‌లో 88.8 మి.మీ, బోథ్‌లో 85.6, నార్నూర్‌లో 84.8, బేలలో 78.4, ఉట్నూర్‌లో 64.2, గాదిగూడలో 60.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అత్యవసరమా.. డయల్ చేయండి

- అందుబాటులో టోల్‌ఫ్రీ నంబర్లు 1800 425 1939, 94921 64153
- భారీ వర్షాల నేపథ్యంలో ఏర్పాట్లు

కై లాస్‌నగర్: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో ప్రజలకు తక్షణ సాయం అందించేందు కోసం టోల్‌ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ కంట్రోల్‌రూం నంబర్ 1800 425 1939, ఆదిలాబాద్ మున్సిపల్‌లోని కంట్రోల్ రూం నంబర్ 94921 64153 ను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కలెక్టర్ కంట్రోల్ రూంలో ఒక్కో షిఫ్ట్‌లో నలుగురు చొప్పున మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తక్షణ సాయం, ఫిర్యాదుల పరిష్కారం కోసం ఈ నంబర్లను సంప్రదించాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. వర్షం తగ్గే వరకు తగిన భద్రతా చర్యలు తీసుకుంటూ, ప్రభుత్వ సహాయ కేంద్రాల నుంచి అందించే సమాచారం, సూచనలకు అనుగుణంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.



కంట్రోల్‌రూంలో సమస్యలు తెలుసుకుంటున్న సిబ్బంది



ఉట్టి కొడుతున్న యువకులు

కృష్ణుని వేషధారణలో..



శ్రీకృష్ణా నమోనమః

ఇస్కాన్ ఆలయంలో దర్శనమిస్తున్న శ్రీ రాధాకృష్ణులు



ఆదిలాబాద్: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఇస్కాన్ రాధాకృష్ణా ఆలయం, శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం, శ్రీ మురళీకృష్ణా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను రాధాకృష్ణులు, గోపికలుగా అలంకరించి మురిసిపోయారు. అశోక్‌రోడ్‌లో ఉట్టికొట్టే కార్యక్రమానికి జనం భారీగా తరలివచ్చారు. కుమార్‌పేట కాలనీకి చెందిన సార్వజనిక్ యూత్ సభ్యులు విజేతలుగా నిలిచారు.

సౌర వెలుగులు

- ప్రభుత్వ కార్యాలయాల్లో ఇక సోలార్ ఏర్పాట్లు
- విద్యుత్ బిల్లుల ఆదాకు సర్కారు నిర్ణయం
- పర్యావరణ పరిరక్షణకు దోహదం
- భవనాల గుర్తింపునకు అధికారుల చర్యలు

కైలాస్‌నగర్: ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు కరెంట్ బిల్లుల భారం తగ్గించుకోవాలని భావిస్తోంది. ఆదిశగా చర్యలు తీసుకోవాలంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇటీవల జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ క్రమంలో దృష్టి సారించిన యంత్రాంగం జిల్లాలోని ఆయా ప్రభుత్వ భవనాలు, వాటికి వినియోగిస్తున్న విద్యుత్ కనెక్షన్ల వివరాల సేకరణలో నిమగ్నమైంది. ఈ నెల 19లోగా పూర్తిస్థాయి సమాచారం సేకరించి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించనున్నారు. తదుపరి ఆదేశాలకు అనుగుణంగా ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నారు.

విద్యుత్ బిల్లుల భారం తగ్గించేలా..

ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతుంది. దీంతో బిల్లులు భారీగా వస్తున్నాయి. సరిపడా నిధులు లేని కారణంగా పలు శాఖలు కరెంట్ బిల్లులు సైతం చెల్లించలేని పరిస్థితి. రూ.కోట్లలో బకాయిలు పేరుకుపోతున్నాయి. ఇది ప్రభుత్వానికి తీవ్ర భారమవుతోంది. దీనిపై దృష్టి సారించిన సర్కారు జిల్లాలోని ఆసుపత్రులు, అంగన్‌వాడీలు, పాఠశాలలు, పంచాయతీ, ఇతర కార్యాలయాల భవనాలపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. టీజీ రెడ్కో ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారు.



కలెక్టర్ కార్యాలయం..

సమాచార సేకరణలో అధికారులు ..

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా యంత్రాంగం ప్రభుత్వ కార్యాలయాల భవనాల గుర్తింపునకు కసరత్తు చేపట్టింది. ఇటీవల అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ రాజర్షి షా భవనాల వివరాలు అందించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో కార్యదర్శులు వివరాలు సేకరిస్తుండగా, మున్సిపల్ పరిధిలో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారు. భవనంపై కప్పు విస్తీర్ణం.. విద్యుత్ కనెక్షన్ కేటగిరీ.., నెల వారీగా వినియోగం వంటి సమాచారం సేకరిస్తున్నారు.

వివరాలు సేకరిస్తున్నాం

ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో సోలార్ ప్లాంటు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం తదనుగుణంగా వివరాలు పంపించాలని ఆదేశించింది. ఈ మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయ భవనాల వివరాలు సేకరిస్తున్నాం. ఎన్ని కిలోవాట్ల సామర్థ్యంతో ప్లాంట్లు ఏర్పాటు చేయాలనేది లెక్కిస్తున్నాం. వాటి ప్రతిపాదనలను సిద్ధం చేసి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తాం.
– శ్రీమన్నారాయణ, రెడ్కో జిల్లా మేనేజర్

విద్యుత్ వినియోగం తక్కువగా ఉండే చోట ఎల్‌టీ, ఎక్కువగా ఉన్న భవన సముదాయాలపై హెచ్‌టీ సర్వీస్‌లతో కూడిన ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. కలెక్టరేట్, రిమ్స్, ఉట్నూర్‌లోని జిల్లా ఆసుపత్రి వంటి విశాల భవనాలపై 100 కిలోవాట్లకు పైబడి సామర్థ్యంతో కూడిన ప్యానెళ్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. క్షేత్రస్థాయి సమాచారం ఆధారంగా ప్రతిపాదలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతారు. బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా ఏర్పాటు చేయనున్నారు. తద్వారా విద్యుత్ ఆదాతో పాటు, పర్యావరణ పరిరక్షణకు ప్రయోజకనకరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

క్లుప్తంగా

షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు



ప్రమాదానికి గురైన ఇల్లు

జన్నారం: మండల కేంద్రంలోని ధర్మారం రోడ్డులో సతీశ్‌గౌడ్ ఇంట్లో శనివారం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఏసీ దగ్ధం కాగా, మంచం, బీరువాలో బట్టలు, సామగ్రి, డబ్బులు కాలిపోయాయి. సమాచారం అందగానే ఫైర్ సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలార్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లినట్లు ఇన్‌చార్జి ఫైర్ అధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు.

కూలిన చెట్టు.. తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన కారు

ఉట్నూర్‌రూరల్: ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని దంతన్‌పల్లి సమీపంలో భారీ చెట్టు కూలింది. శనివారం తెల్లవారుజామున ఉట్నూర్ వైపు నుంచి జన్నారం వైపు కారులో ఓ కుటుంబం వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. డ్రైవర్ ఒక్కసారిగా కారు ఆపడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. కారులో ఉన్నవారు సురక్షితంగా బయటపడ్డారు. గ్రామస్తులు చెట్టును తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.

గొలుసు దొంగ అరెస్ట్



వెల్లడిస్తున్న భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్

లోకేశ్వరం: మహిళ మెడలో గొలుసు చోరీ చేసిన దొంగను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం భైంసాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఎస్పీ అవినాష్‌కుమార్ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. లోకేశ్వరం మండలంలోని వాస్తాపూర్ గ్రామానికి చెందిన మేకల యమున తన రెండు ఎద్దులను గురువారం అబ్దుల్లాపూర్ వెళ్లేదారిలో మేపుతోంది. ఒంటరిగా ఉన్న ఆమెతో దొంగ మాయమాటలు చెప్పి మెడలో రెండు తులాల బంగారు గొలుసును చోరీ చేసి బైక్‌పై పారిపోయాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కన్కపూర్, అబ్దుల్లాపూర్ సీసీ పుటేజీలను పరిశీలించారు. ముథోల్ మండలంలోని ఆష్టా గ్రామానికి చెందిన పిప్పెర విజయ్‌గా గుర్తించి శనివారం అరెస్టు చేశారు. అతని వద్ద ఉన్న రెండు తులాల బంగారు గొలుసుతోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్ తరలించారు. చాకచక్యంగా నిందితుడిని పట్టుకున్న లోకేశ్వరం ఎస్సై అశోక్, కానిస్టేబుల్ శ్రీనివాస్, సాయిప్రశాంత్, లక్ష్మణ్‌లను ఏఎస్పీ అభినందించారు.

గిరిజనేతరుల చేతిలో వేల ఎకరాలు

- అటవీ భూముల ఆక్రమణలో ఎస్సీ, బీసీలు
- స్వాధీనానికి అటవీ శాఖ యత్నం
- హక్కులు కల్పించాలంటూ డిమాండ్లు



ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం దిందాలో సాగులో ఉన్న అటవీ భూమి(ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అటవీ భూములు సాగు చేస్తున్న వేలాది గిరిజనేతరులు తమకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా బీసీ, ఎస్సీలు అటవీ భూముల ఆధారంగానే జీవిస్తూ సాగు చేసుకుంటున్నారు. గిరిజనులకు ఆర్వోఎఫ్ఆర్(అటవీ హక్కుల గుర్తింపు) కింద పట్టాలు ఇచ్చారు. కానీ గిరిజనేతరులకు అవకాశం లేదు. దీంతో ఏటా సీజన్‌లో ఆ భూముల్లో విత్తనాలు వేసే సమయంలో ఆక్రమణదారులు, అటవీ అధికారుల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని చోట్ల తిరిగి స్వాధీనం చేసుకుని మొక్కలు నాటుతున్నారు. తాజాగా ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం దిందా గ్రామస్తులను అటవీ అధికారులు సాగు చేసుకోకుండా అడ్డుకుంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు పాదయాత్ర చేపట్టగా, మధ్యలోనే పోలీసులు అడ్డుకుని తీసుకొచ్చారు.

బీసీ, ఎస్సీలు అధికం

అటవీ భూములను గిరిజనులతోపాటు బీసీ, ఎస్సీ ఇతర వర్గాలు వేలాది మంది సాగు చేస్తున్నారు. వీరికి సైతం పట్టాలు ఇవ్వాలని డిమాండ్లు వచ్చినప్పటికీ ప్రభుత్వం పక్కన పెట్టింది. మూడేళ్ల క్రితం రాష్ట్రవ్యాప్తంగా 1.50లక్షల మంది గిరిజన రైతులకు 4.05లక్షల ఎకరాల్లో హక్కులు కల్పించారు. చట్టం ప్రకారం గిరిజనులకు మాత్రమే హక్కులు ఉన్నాయి. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాద్ జిల్లాల్లోనూ గిరిజనేతరులు సాగులో ఉన్నారు. రిజర్వు ఫారెస్టుతోపాటు పులుల సంరక్షణ కేంద్రమైన కవ్వాల్ పరిధిలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇంకా 1.29లక్షల ఎకరాలు ఆక్రమణలో ఉంది. గిరిజనేతరులతోపాటు కొన్ని చోట్ల గిరిజనులు సైతం కొత్తగా ఆక్రమణలకు పాల్పడుతుండడంతో అడవుల సంరక్షణ మరింత ఇబ్బందిగా మారిందని అధికారులు వాపోతున్నారు.

అధికారుల నిర్లక్ష్యమే..

నిజాం కాలం నుంచే అటవీ ఆక్రమణలు ఉన్నప్పటికీ గత 20ఏళ్లలో ఈ ఆక్రమణలు తీవ్రంగా పెరిగాయి. పత్తి సాగు మొదలైనప్పటి నుంచి గిరిజనులతోపాటు గిరిజనేతరులు సైతం పెద్ద ఎత్తున చెట్లను నరికి సాగులోకి వచ్చారు. ఆ సమయంలో కొంతమంది సిబ్బంది అవినీతితో ఇష్టారీతిన ఆక్రమణలు జరిగాయి. మరికొన్ని చోట్ల రాజకీయ ఒత్తిళ్లు, అధికారుల నిర్లక్ష్యం, తదితర కారణాలతోనూ రిజర్వు ఫారెస్టుల్లో సాగు మొదలైంది. ఆ భూములే తిరిగి స్వాధీనం చేసుకోవాలంటే సామాజిక సమస్యగా మారింది.

దిందాలో ఒక్కొక్కరు 40ఎకరాల వరకు..

ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం బందెపల్లి, దిందాలో పరిధిలో ఒక్కో కుటుంబం ఎకరం నుంచి 42ఎకరాల వరకు ఆక్రమించారు. ఇందులో పది నుంచి 30ఎకరాల వరకు సాగులో ఉన్నారు. ఇక్కడ 530ఎకరాల్లో గిరిజనులకు పట్టాలు ఇచ్చారు. రిజర్వు ఫారెస్టులో 2600ఎకరాలు ఆక్రమణలో ఉంది. అయితే 600ఎకరాలను సాగుదారులకు వదిలేశారు. మిగతాది గిరిజనేతరుల నుంచి స్వాధీనం చేసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తుండగా వివాదం రాజుకుంటోంది.

చోరీ కేసులో ముఠా నాయకుడి అరెస్టు

- పరారీలో ముగ్గురు
- వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడుతున్న ముఠా నాయకుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. మావల పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈమేరకు వివరాలు వెల్లడించారు. చౌహాన్ రవి, సుఖ్‌దేవ్, షోహెల్, మైకల్వర్ సాయినాథ్, అమ్ము, కరణ్‌లు ముఠాగా ఏర్పడి రాష్ట్రంతోపాటు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. ఇందులో సాయినాథ్‌ను ఈనెల 12న పీటీ వారెంట్‌పై హాజరుపర్చగా, ఈనెల 14న సుఖ్‌దేవ్, పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు చౌహాన్ రవిని శనివారం అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో ముగ్గురు షోహెల్, అమ్ము, కరణ్‌లు పరారీలో ఉన్నారు. పట్టుబడ్డ వారి నుంచి రూ. 9,500 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. చౌహాన్ రవిపై వివిధ పోలీస్ స్టేషన్లల్లో 25 క్రిమినల్ కేసులు, సఖ్‌దేవ్‌పై రాష్ట్ర వ్యాప్తంగా 22కు పైగా కేసులు నమోదై ఉన్నాయన్నారు. దొంగలను పట్టుకున్న మావల సీఐ కర్రె స్వామి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు. సమావేశంలో ఎస్సై ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణుల తరలింపు



అంబులెన్స్‌లో తరలిస్తున్న వైద్యసిబ్బంది

వేమనపల్లి: భారీ వర్షాలు దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాలతో శనివారం వేమనపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేష్ ఆధ్వర్యంలో లోతట్టు గ్రామాల్లోని గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కళ్లెంపల్లి, జాజులపేట, సుంపుటం గ్రామాలకు చెందిన కుడిమెత భారతి, శకుంతల, కుబిడె రోజును వేమనపల్లి పీహెచ్‌సీ నుంచి అంబులెన్స్‌లో చెన్నూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వరద తీవ్రత పెరుగుతుండటంతో ముందు జాగ్రత్తగా తరలిస్తున్నట్లు వైద్యాధికారి తెలిపారు. ఇన్‌చార్జి హెల్త్ సూపర్‌వైజర్ రాంశెట్టి బాపు, ఏఎన్ఎం మంజుల, రాజ్యలక్ష్మి, ఈఎంటీ జనార్దన్, పైలెట్ సంపత్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరేసుకుని ఆత్మహత్య



సాయినాథ్ (ఫైల్)

కుంటాల: మండలంలోని లింబా(బి) గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ గాండ్ల సాయినాథ్ (40) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. సాయినాథ్‌కు గత 20 ఏళ్ల క్రితం రజితతో వివాహమైంది. ఇప్పటివరకు సంతానం కాలేదు. దివ్యాంగుడు కాగా, మద్యానికి బానిసయ్యాడు. శనివారం ఉదయం ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. మృతదేహానికి పంచనామా నిర్వహించారు. మృతుడి తండ్రి అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మతిస్థిమితంలేని వృద్ధుడు..

సిర్పూర్(టి): మండలంలోని నవేగాం గ్రామానికి చెందిన రాంటెంకి రుషి(60) శుక్రవారం పెన్‌గంగ నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కమలాకర్ కథనం ప్రకారం.. రుషి గత కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతుండేవాడు. శుక్రవారం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. దహెగాం మండలకేంద్రం శివారులో పత్తి చేనులో అతని బట్టలు దొరకగా శనివారం ఉదయం పెన్‌గంగ నదిలో మృతదేహం ఆచూకీ లభ్యమైంది. పెద్దనాన్న కుమార్తె యశోదాబాయి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అడవిపంది దాడిలో వ్యక్తి మృతి

భీమిని: అడవిపంది దాడిలో వ్యక్తి మృతిచెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కన్నెపల్లి ఎస్సై భాస్కర్‌రావు, స్థానికులు తెలిపిన వివరాలు.. భీమిని మండలం వెంకటపూర్‌కు చెందిన దాగామ రామయ్య (70) కన్నెపల్లి మండలం సుర్జాపూర్ శివారులో శనివారం పత్తి చేనుకు వెళ్లి వస్తున్నాడు. ఈక్రమంలో అడవి పంది దాడిలో అతడు గాయపడ్డాడు. పక్క చేనులో ఉన్న రైతులు గట్టిగా కేకలు వేయగా అది పరిగెత్తింది. రామయ్యను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. అక్కడి నుంచి వెళ్లిన అడవి పంది గురుండ్ల చిరంజీవి, మేకల బాపులపై దాడి చేసి గాయపర్చింది. మృతుడి కుమారుడు రాజేశం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు మైనర్లపై కేసు

ముథోల్: మండలంలోని గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు మైనర్ విద్యార్థులపై శనివారం కేసు నమోదైనట్లు ఎస్సై బిట్లా పెర్సిస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 8వ తరగతి, టెన్త్, ఇంటర్ విద్యార్థులు శుక్రవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, పాటల పోటీలు ఉండగా మైక్ విషయంలో గొడవపడ్డారు. ఇద్దరు మైక్ దాచిపెట్టగా ఈక్రమంలో గొడవ జరిగింది. ఇద్దరిని కొట్టడంతో గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై అక్కడికి చేరుకున్నారు. బాధిత విద్యార్థి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా ఎంపిక పోటీలు



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

రెబ్బెన: గోలేటిలో ఈనెల 23, 24 తేదీల్లో నిర్వహించే అంతర్ జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు సత్తాచాటాలని బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతి పేర్కొన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా పురుషులు, మహిళల క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. సుమారు 40 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 17 నుంచి 21 వరకు సింగరేణి క్రీడామైదానంలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇందులో ప్రతిభ చూపినవారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సీపీఐ పట్టణ కార్యదర్శి మారం శ్రీనివాస్, జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్‌రెడ్డి, భాస్కర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు చందర్ ఏఐటీయూసీ నాయకులు జగ్గయ్య, క్రీడాకారుడు నరేశ్ పాల్గొన్నారు.

శిక్షణ శిబిరానికి ఎంపిక

ఉమ్మడి జిల్లా పురుషుల జట్టుకు కె.సిద్దార్థ్, ఎం.తిరుపతి, పి.పవన్‌కుమార్, కె. తరుణ్, జి.గోపాల్, పి.శ్రీకాంత్, సాయి చరణ్, టి.దిలీప్‌కుమార్, పి.దేవరాజ్, ఎం.సూర్యకుమార్, ప్రేంకుమార్, సీహెచ్ గోపాలకృష్ణ, సీహెచ్ వరణ్ ఎంపికయ్యారు. మహిళ జట్టుకు ఏ.స్వప్న, కె.అంజలి, డి.శ్రావణి, జి.అనూష, కె.శ్రీస్ఫూర్తి కారుణ్య, టి.ప్రజ్వల శ్రీ, పి.వర్షిణి, సుజాత, సాయిదీక్ష, సంజన, అర్చన, వైష్ణవి, హారిక ఎంపికయ్యారు.

క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలి

- బేస్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హరిశంకర్
- ప్రారంభమైన రాష్ట్రస్థాయి పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న హరిశంకర్

ఆదిలాబాద్: క్రీడాకారులంతా క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని రాష్ట్ర బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు చల్లా హరిశంకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో తెలంగాణ 5వ సీనియర్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ చాంపియన్‌షిప్ (మహిళలు-పురుషులు) పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, రెండింటిని సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడాభివృద్ధికి ఎంతగానో పాటుపడుతున్నామన్నారు. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. పది రోజుల పాటు శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తామని వివరించారు. పోటీల్లో రాష్ట్ర జట్టు విజేతగా నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.శ్వేత మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతోమంది ప్రతిభగల క్రీడాకారులు ఉన్నారని పేర్కొన్నారు. క్రీడల్లో రాణించినవారికి గొప్ప భవిష్యత్తు ఉంటుందన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కలాల శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం శుభపరిణామన్నారు. 33 జిల్లాల నుంచి సుమారు 700 క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్, అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి డా.కృష్ణ, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పందిరి జ్యోతి, ఉపాధ్యక్షుడు లోక ప్రవీణ్‌రెడ్డి, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు, వ్యాయామ ఉపాధ్యాయులు దయానందరెడ్డి, హరిచరణ్, రామ్‌కుమార్, జిల్లాల నుంచి కార్యదర్శులు, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు

పురుషుల విభాగంలో ఆదిలాబాద్ కరీంనగర్ జట్టుపై 6-1తో, హైదరాబాద్ నిర్మల్ జట్టుపై 7-1తో, మహబూబ్‌నగర్ సిద్దిపేట జట్టుపై 7-2తో విజేతలుగా నిలిచాయి. మహిళల విభాగంలో నిజామాబాద్ జట్టు సిద్దిపేటపై 9-0తో, కరీంనగర్ జట్టు మహబూబాబాద్ జట్టుపై 6-5తో, నల్గొండ జట్టు ఆసిఫాబాద్ జట్టుపై 7-4తో విజేతలుగా నిలిచాయి.

ముగిసిన తీజ్ వేడుకలు



యువతులు, మహిళల నృత్యాలు

ఇంద్రవెల్లి: మండలకేంద్రంతోపాటు హర్కపూర్, బిక్కుతండా, ఈశ్వర్‌నగర్ తదితర తండాల్లో తీజ్ ముగింపు వేడుకలను శనివారం నిర్వహించారు. రాఖీపౌర్ణమి నుంచి ప్రారంభమైన తీజ్ వేడుకల్లో పెళ్లి కాని యువతులు గ్రామపెద్ద ఇంట్లో వెదురు బుట్టల్లో గోధుమ నారు నాటారు. 9 రోజులపాటు ప్రత్యేక పూజలు చేసి గోధుమ నారుకు నీరు పోశారు. గోకులాష్టమి సందర్భంగా తీజ్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యువతులు, మహిళలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం గ్రామపొలిమేరలో వాగులో తీజ్‌లను వదిలి ఉత్సవాలు ముగించారు. గ్రామపెద్దలు చవాన్ ఉమాజీనాయక్, జాదవ్ దుదిరాం, రాథోడ్ శేవంతబాయి రోహిదాస్, జాదవ్ మీరాబాయి, సేవాలాల్ ధర్మ ప్రచారక్ ప్రేమ్ మహారాజ్, గంగారం రాథోడ్, సంతోష్ రాథోడ్ తదితరులు ఉన్నారు.

'కనకాయి'.. పరవళ్లు



బజార్‌హత్నూర్ మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు కడెం, బంద్రేవ్, బోస్రా వాగుల్లో వరద నీరు పోటెత్తింది. కడెం నదిపై గల కనకాయి జలపాతం పరవళ్లు తొక్కింది. వీటిని తిలకించేందుకు పర్యాటకులు తరలివచ్చారు. ఇక్కడ పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు. – బజార్‌హత్నూర్


ఎస్సారెస్పీకి పోటెత్తిన వరద



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ

ఎస్సారెస్పీ ఎగువన మహారాష్ట్రలో వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్ట్‌లోకి భారీగా వరద పోటెత్తింది. శనివారం 1.04 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకు ప్రస్తుతం 1083 అడుగులు ఉంది. 80.5 టీఎంసీలకుగాను 53.62 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్ట్ నుంచి 5 వేల క్యూసెక్కుల నీటిని కాకతీయ కాలువ, మిషన్ భగీరథకు వదులుతున్నారు. గోదావరిలో భారీగా వరద నీరు చేరే అవకాశం ఉన్నందున పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్ట్ అధికారులు సూచించారు. పశువుల, గొర్రెల కాపర్లు, చేపలు పట్టేవారు, రైతులు గోదావరి నదిని దాటే ప్రయత్నం చేయొద్దని పేర్కొన్నారు. – మామడ

'పొచ్చెర' ఉరకలు



అలుగు పారుతున్న కరత్వాడ ప్రాజెక్టు



ఉరకలెత్తుతున్న పొచ్చెర జలపాతం

రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి పొచ్చెర జలపాతం ఉరకలెత్తింది. శనివారం భారీ వరద నీరు చేరడంతో జలపాతం నిండుకుండలా మారింది. కరత్వాడ ప్రాజెక్టు నిండిపోవడంతో అలుగు పారింది. ప్రాజెక్టును చూడటానికి సందర్శకులు తరలివచ్చారు. పొచ్చెర జలపాతం అందాలు చూసేందుకు అటవీ అధికారులు అనుమతి ఇవ్వలేదు. – బోథ్

కడెం వరదలో వ్యక్తి గల్లంతు

- చేపల కోసం కడెం గేట్ల కిందకు వెళ్లి..
- ప్రవాహం పెరిగి, నీటిలో కొట్టుకుపోయి
- రాత్రివేళ గాలింపు నిలిపివేత



పాండ్వపూర్ బ్రిడ్జి వద్ద కొట్టుకువస్తున్న గంగాధర్



తిప్పిరెడ్డి గంగాధర్ (ఫైల్)

కడెం/దస్తురాబాద్: చేపల వేటకు వెళ్లి కడెం వరదలో చిక్కుకుని ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. కడెం మండలం కన్నాపూర్‌కు చెందిన తిప్పిరెడ్డి గంగాధర్ (45) శనివారం కడెం గేట్లు ఎత్తడంతో కుమారుడు, మరో వ్యక్తితో కలిసి ప్రాజెక్ట్ గేట్ల దిగువన వెళ్లాడు. రెండు గేట్లు మూసివేయడంతో నీటి ప్రవాహం తగ్గిందని కర్రలతో చేపలు వేటాడేందుకు వెళ్లాడు. అరగంట తర్వాత ఇన్‌ఫ్లో పెరగడంతో అధికారులు సైరన్ మోగించి మరో రెండు గేట్లు ఎత్తారు. సమీపంలో వందలాది మంది కేకలు వేసిన గంగాధర్ ఫోన్ చూస్తుండగా ఒక్కసారిగా చుట్టూ నీళ్లు చేరాయి. బయటకు రాలేక, కొద్ది దూరంలో బండపై నిల్చొని కాపాడండి అంటూ కేకలు వేశాడు. వరద ప్రవాహం పెరగడంతో అందరు చూస్తుండగానే నీటిలో కొట్టుకుపోయాడు. 3 కి.మీ మేర మునుగుతూ, తేలుతూ ఈదుతున్నాడు. పాండ్వపూర్ సమీపంలో కడెం వంతెనను దాటి వెళ్లడం అక్కడే ఉన్నవారు, కానిస్టేబుళ్లు నాగరాజు, వంశీ గమనించారు. చెట్లపొదల పక్క నుంచి కొట్టుకుపోతున్న అతన్ని కాపాడేందుకు పరిగెత్తి ప్రయత్నించారు. సుమారు 3 కి.మీ మేర బురదలో వెళ్లిన ఫలితం దక్కలేదు. అదేవిధంగా దస్తురాబాద్ మండలం భూత్కూర్ పంచాయతీ రాంపూర్ గోదావరి తీర ప్రాంతంలో ఎన్డీఆర్ఎఫ్ బృందం గాలింపు చేపట్టింది. ఎస్సై సాయికుమార్, తహసీల్దార్ విశ్వంబర్ అక్కడికి చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించి ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించారు. గల్లంతైన వ్యక్తి ఆచూకీ దొరకకపోవడం, రాత్రి కావడం, వరద ప్రవాహం పెరగడంతో గాలింపును నిలిపివేశారు. కడెం ప్రాజెక్ట్ వద్ద ఉన్న ఎన్డీఆర్ఎఫ్ బృందం స్పందిస్తే వరదల్లో గంగాధర్‌ను బయటకు తీసుకువచ్చేవారని స్థానికులు వాపోయారు. గంగాధర్‌కు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఉపాధి నిమిత్తం బిస్కెట్లు, కేక్‌లు, చాక్లెట్లు తదితర బేకరీ ఐటెమ్స్‌ను షాపులకు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాడు.

కేకలు వేశాం

కడెం గేట్లు దూరాన ఉన్న మేము బయటకు రావాలని కేకలు వేశాం. అతను గమనించలేదు. నేను పోతున్నా అంటూ గట్టిగా అరిచాడు. 20 నిమిషాల వ్యవధిలో వరదలో కొట్టుకుపోయాడు. – వినయ్, ప్రత్యక్ష సాక్షి

ప్రయాణికులను కాపాడిన సీఐ



రక్షించిన ప్రయాణికులతో సీఐ సాయిరమణ

ఖానాపురం: వరద నీటిలో చిక్కుకున్న ఓ కుటుంబాన్ని వరంగల్ జిల్లా దుగ్గొండి సీఐ సాయిరమణ కాపాడారు. వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లాకు చెందిన బాస లక్ష్మీనారాయణ, అన్నపూర్ణ, రితిక, రితిన్ భద్రాచలానికి కారులో వెళ్తున్నారు. ఖానాపురం మండలంలోని చిలుకమ్మనగర్-కొత్తగూడ మధ్యలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీటిలో చిక్కుకుపోయారు. వెంటనే లక్ష్మీనారాయణ పోలీసులకు సమాచారం అందించారు. డీజీ కంట్రోల్ కార్యాలయం నుంచి స్థానిక పోలీసులకు సమాచారం అందడంతో సీఐ సాయిరమణ శనివారం తెల్లవారుజామున 3 గంటలకు చిలుకమ్మనగర్‌కు చేరుకుని గ్రామస్తుల సహకారంతో వారిని క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. సదరు కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.